క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామివారు

నింద్ర: మండలంలోని నింద్ర క్రాస్ రోడ్డు వద్ద ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమిళనాడు చెన్నైలోని పెరంబూర్‌కు చెందిన భక్తులు తిరుమలకు కాలినడకన బయల్దేరారు. మార్గమధ్యలోని నింద్ర క్రాస్ వద్ద శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

శ్రీలక్ష్మీనరసింహాకు షైనింగ్ స్టార్ అవార్డు

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డులను శ్రీలక్ష్మీనరసింహా ప్రైవేటు పాఠశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారని ఆ పాఠశాల కరస్పాండెంట్ దిలీప్‌కుమార్ అన్నారు. శనివారం కరస్పాండెంట్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించిన షైనింగ్ స్టార్ పోటీలలో ఆరు అవార్డులను కైవసం చేసుకుని మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచామన్నారు. ఇంతటి విజయాన్ని పాఠశాలకు అందించిన విశ్వవిష్ణురాయల్ 580, మోహిత్‌సాయి 573, నాగేశ్వరి 568, మహిత్ రెడ్డి 552 అవార్డులను కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. అనంతరం అవార్డులను అందుకున్న విద్యార్థులను ఆ పాఠశాల డైరెక్టర్లు అభినందించారు. ప్రధానోపాధ్యాయిని లత, పాఠశాల డైరెక్టర్లు ధనుంజయరెడ్డి, వెంకటేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతు అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త

వడమాలపేట (విజయపురం): వ్యవసాయంలో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త రాము కుమార్ తెలిపారు. మండల వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం టి.సి.అగ్రహారం, యల్లంకండ్రిగ, పాదిరేడులో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్ సాగు, యాజమాన్య పద్ధతేలే, భూసార పరీక్షపై అవగాహన కల్పించారు. పాడి పశువులు, కోళ్ల పెంపకంపై చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి శాస్త్రవేత్త డాక్టర్ సుమంతా కుందూ, వెంకటేశ్వర పశువైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ త్రివేణి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


రైల్వే పోలీసుల ముమ్మర తనిఖీలు



తనిఖీలు చేస్తున్న ఆర్పీఎఫ్ పోలీసులు

పుత్తూరు: రైల్వే ప్రయాణికుల సురక్షిత ప్రయాణం తమ బాధ్యత అని, అందుకు తగ్గట్టు రైల్వే పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసినట్‌ల్ రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. శనివారం సాయంత్రం పుత్తూరు రైల్వేస్టేషన్ వద్ద రైలు బోగీల్లో ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతాలైన పుత్తూరు, నగరి స్టేషన్లలో గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచినట్లు తెలిపారు. అక్రమ రవాణాతో పాటు రైళ్లలో చోరీల నియంత్రణకు తగిన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు సమీక్షిస్తుంటామని తెలిపారు. అనునిత్యం రైళ్లలో తనిఖీలను నిర్వహిస్తూ ప్రయాణికుల భద్రతకు సహకరిస్తున్నట్లు తెలిపారు. రైళ్లు, ప్లాట్‌ఫామ్స్‌పై ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే ఆర్పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

భారత్‌దే యోగా ఘనత



యోగాలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పుత్తూరు: యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత భారతదేశానికే దక్కిందని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. శనివారం విద్యార్థులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కోటేశ్వరయ్య, వీరయ్య, నరసింహులు, దేవకి, నాగేశ్వరరావు, కృష్ణయ్య, సుజన, వెంకటేశన్ పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా ఎంతో ముఖ్యం

పాలసముద్రం: ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి ఆధ్వర్యంలో నరసింహపురం సచివాలయ ఆవరణలో మహిళలకు యోగాపై అవగాహన కల్పించి యోగా చేయించారు.

దక్కని గౌరవం

- గౌరవ వేతనం విడుదల చేయని కూటమి ప్రభుత్వం
- ఎంపీటీసీ సభ్యులకు వేతన యాతన



నగరి మండల పరిషత్ కార్యాలయం

నగరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకు ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు ఇవ్వకుండా వారి సహనాన్ని పరీక్షిస్తోంది. ప్రతి ఎంపీటీసీ సభ్యుడికి నెలకు రూ.3 వేలు చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలి. వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ సమయంలో రెండు విడతల్లో ఎంపీటీసీలకు గౌరవ వేతనాలు చెల్లించారు. సార్వత్రిక ఎన్నికల కారణంగా పాలన చివరిలో గత ప్రభుత్వం ఎంపీటీసీలకు వేతనాలు చెల్లించలేకపోయింది. 2024 జూన్‌లో కొత్తగా కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. అంతకు ముందు పెండింగ్‌లో ఉన్న వేతనాలతోపాటు కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గౌరవ వేతనమే అందించలేదు. దీంతో ఒక్కోసభ్యునికి రూ.54 వేలు ప్రభుత్వం బకాయి పడింది. రాష్ట్ర వ్యాప్తంగా వ్యాప్తంగా కూటమి పార్టీల ఎంపీటీసీ సభ్యుల కంటే వైఎస్ఆర్ సీపీ ఎంపీటీసీ సభ్యులే ఎక్కువగా ఉండడంతో వారికి న్యాయబద్ధంగా అందాల్సిన గౌరవ వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. వేతనాల కోసం వారంతా ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందిస్తున్నా స్పష్టమైన హామీ లేకపోవడంతో తమ గోడును ఎవరికి చెప్పాలో అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. సంబంధిత మండల పరిషత్ అధికారులు వేతనాల కోసం బిల్లులు పెడుతున్నామని రాష్ట్ర స్థాయి ఆర్థిక విభాగం నుంచి అవి విడుదల కావాలని అధికారులు చెబుతున్నారు.

సభ్యుల అసంతృప్తి

గౌరవ వేతనం మంజూరు చేయకపోవడంతో ఎంపీటీసీ సభ్యులందరూ అసంతృప్తితో ఉన్నారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులమైనా తమకు ఏమాత్రం గౌరవం ఇవ్వడం లేదంటున్నారు. ఎంపీపీకి తెలియకుండానే మండలంలో పనులు, కార్యక్రమాలు నిర్వహించడం, దానిపై సర్వసభ్య సమావేశంలో పెద్ద ఎత్తున దుమారం రేగిన సంఘటనలు కూడా ఇదివరలో చోటుచేసుకున్నాయి. అధికారులు చేపట్టే కార్యక్రమాల్లో టీడీపీ నాయకులకు ఇచ్చిన ప్రాధాన్యం తమకు ఇవ్వడం లేదని ఎంపీటీసీలు తెలుపుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నుంచి సర్వసభ్య సమావేశాలకు హాజరు కావడమే తప్ప.. తాము చెప్పిన ప్రజల సమస్యలను పరిష్కరించడం లేదంటున్నారు.

గౌరవ వేతనం మంజూరు చేయాలి



ఎంపీటీసీలకు కూటమి ప్రభుత్వం గౌరవ వేతనాలతోపాటు నిధులు, అలవెన్సులు కూడా ఇవ్వడం లేదు. ఎంపీటీసీ సభ్యులందరూ ఆర్థిక స్తోమత కలిగిన వారని ప్రభుత్వం పరిగణిస్తోంది. ఇప్పటికైనా గౌరవ వేతనాలు అందజేయాలి. గత ప్రభుత్వం సకాలంలో వేతనాలు, ప్రయాణ అలవెన్సు అందించింది.

-కన్నియప్ప, వైస్ ఎంపీపీ, నగరి మండలం

బాధ్యత అధికారులదే..



ప్రజా సమస్యలను అధికారుల వద్దకు తీసుకుని వెళ్లి వాటిని పరిష్కరించేందుకు ప్రజలు మమ్మల్ని ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజాప్రతినిధులకు వారి పదవిని బట్టి తగిన గౌరవ వేతనాలు అందించి గౌరవించడం ప్రభుత్వం, అధికారుల బాధ్యత. వారికి ఎప్పటికప్పుడు వేతనాలు ఇవ్వాల్సి ఉంది. జీతాలు ఇవ్వకుండా బకాయి పెట్టడం ఎంత వరకు సమంజసం.

-రాజగోపాల్, ఎంపీటీసీ సభ్యులు, బూచివానత్తం, విజయపురం మండలం

చిత్తశుద్ధి లేదు



రాష్ట్ర ప్రభుత్వం వైఎస్ఆర్ సీపీ ఎంపీటీసీ సభ్యులను చిన్నచూపు చూడడంలో అంతర్యమేంటి? మాకు రావాల్సిన వేతనాలు చెల్లించడానికి మేమే ప్రాధేయపడాలా? మహిళా ప్రజాప్రతినిధులుగా రాణించాలంటే ప్రభుత్వం తగిన సహకారం అందించాలి. కానీ వైఎస్ఆర్ సీపీ ఎంపీటీసీలంటేనే ఈ ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి లేదు. వేతనాల బిల్లులు పెడుతున్నా మంజూరు చేయకపోవడం దౌర్భాగ్యం ఇకనైనా న్యాయబద్ధంగా రావాల్సిన మా వేతనాలు విడుదల చేయాలి.

-తులసి, ఎంపీటీసీ సభ్యురాలు, బీరకుప్పం, నగరి మండలం

బిల్లులు పెడుతున్నాం

బడ్జెట్ రావడంతో ఎప్పటికప్పుడు బిల్లులు పెడుతున్నాం. గత నెల వరకు కూడా బిల్లులు పెట్టేశాం. ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలకు సంబంధించిన గ్రాంట్ విడుదల కాగానే వారికి అందిస్తాం. బకాయిలు ఉన్న మాట వాస్తవమే. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. ఎంపీటీసీ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వానికి, అధికారులకు ఎంపీటీసీ సభ్యులంటే చిన్నచూపు ఉండదు. వారి సమస్యలను పరిష్కరించడమే మా బాధ్యత.

-కృష్ణయ్య, ఎంపీడీఓ, నగరి మండలం

వెబ్ కౌన్సెలింగ్ వద్దు



వెబ్ కౌన్సెలింగ్ వద్దంటూ ఉపాధ్యాయుల నిరసన

కార్వేటినగరం: వెబ్ కౌన్సెలింగ్ వద్దు, మాన్యువల్ కౌన్సెలింగే కావాలని శనివారం సాయంత్రం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు ఎమ్మార్సీ భవనం ఎదుట ఉపాధ్యాయ సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే నెల 19, 20వ తేదీల్లో పాఠశాల విద్యాకార్యదర్శితో ఉపాధ్యాయ సంఘాలు జరిపిన చర్చలలో ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేపట్టాలని కోరడంతో అందుకు అంగీకరించామన్నారు. కానీ ఎస్జీటీలకు నిన్న రాత్రి నుండి వెబ్ ఆప్షన్స్ ద్వారా కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పడం దారుణంగా ఉందని, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘ జిల్లా నాయకులు నాగేంద్రరాజు, సర్దార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు గురవయ్య, శివాజీ, జగదీశన్, రఘురామకృష్ణ, వేణు, లక్ష్మీపతి, మనోజ్‌కుమార్, హరి, సునీత, వాసు, గంగాధరం, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై ఫిర్యాదు

పుత్తూరు: పట్టణంలోని స్వర్ణ లేఅవుట్‌లో నివాసం ఉంటున్న కుప్పిరెడ్డి కుమార్తె మేఘన(21) ఈనెల 4వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు అందినట్లు సీఐ సురేంద్రనాయుడు తెలిపారు. మేఘన స్థానిక వెంకటపెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ ఫస్టియర్ చదువుతోందని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వధూవరులకు ఆశీస్సులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: స్థానిక ఏఎంసీ కల్యాణమండపంలో శనివారం జరిగిన 15వ వార్డు కౌన్సిలర్ భానుమతి భర్త చక్రి సోదరుడి కుమారుడు తరుణ్ వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. తడుకు రైల్వే స్టేషన్ కేబీఆర్ కల్యాణ మండపంలో వడమాలపేట మండలం శ్రీనివాసరెడ్డి కుటుంబ వివాహ రిసెప్షన్‌లో పాల్గొన్నారు. ఆమె వెంట పలువురు వైఎస్ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

తిరునాళ్లకు ఆహ్వానం

పుత్తూరు మున్సిపాలిటీ 10వ వార్డు కామరాజునగర్‌లో ఆదివారం జరిగే శ్రీఅంకాళ పరమేశ్వరి తిరునాళ్లలో పాల్గొనాలని మాజీ మంత్రి ఆర్కే రోజాను స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులు ఆహ్వానించారు.

ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు

- తమిళనాడుకు తరలించేస్తున్నారు
- అక్రమ గ్రావెల్ క్వారీలను ఆపకపోతే యంత్రాలను పగులకొడుతాం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరికలు



గ్రావెల్ క్వారీ వద్ద సీపీఐ నారాయణ

నగరి: నియోజకవర్గంలో ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారని, అక్రమ గ్రావెల్ క్వారీలను ఆపకపోతే మెషినరీలను పగులకొడుతామని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాస్ వార్నింగ్ ఇచ్చారు. శనివారం నియోజకవర్గంలోని క్వారీలను ఆయన పరిశీలించారు. గ్రావెల్ క్వారీలో పరిమితికి మించి గ్రావెల్ మైనింగ్ చేయడంతో పాటు, జాతీయ రహదారుల పనులకంటూ సాకులు చెపుతూ తమిళనాడుకు తరలించి డబ్బులు దండుకుంటున్నారన్నారు. పరిమితులకు మించి గ్రావెల్ తవ్వకాలు చేపట్టడంలో భాగంలో ఇష్టానుసారంగా బాంబ్ బ్లాస్టింగ్ చేయడంతో సమీప ప్రాంతాల్లోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని, గుట్టని ఆనుకుని ఉన్న పచ్చని పొలాల్లో మేస్తున్న పాడి పశువులు బాంబ్ బ్లాస్టింగ్, మిషనరీ శబ్దాలకు భయభ్రాంతులకు గురవుతున్నాయన్నారు. రాత్రిపూట కూడా భారీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టడంతో చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాజకీయ పార్టీలు, అధికారుల అండదండలతో అక్రమంగా వారి నడుపుతున్న యజమానులు తక్షణమే ఆపేయాలని సంబంధిత రెవెన్యూ, మైనింగ్ అధికారులు కూడా అక్రమ గ్రావెల్ క్వారీని మూసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. లేకుంటే తాము ప్రజలను భారీ ఎత్తున సమీకరించి మిషన్లను పగలగొడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు కోదండయ్య, నగరి పట్టణ కార్యదర్శి వేలన్, ఏఐటీయూసీ నాయకులు శేఖర్, బాషా, మురళి, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



నింద్రలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పెనుమూరులో ప్రత్యేక ప్రార్థనలు

నింద్ర: మండలంలోని ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రమైన నింద్రలో ఉదయం ముస్లింలు నూతన దుస్తులు ధరించి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువు బోధించిన సూక్తులను ప్రతి ఒక్కరు అనుసరించాలని కోరారు. అనంతరం ఖుర్బానీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ముస్లింలు పాల్గొన్నారు. అదే విధంగా పాదిరి గ్రామంలో కూడా ముస్లింలు బక్రీద్ పండుగను వైభవంగా నిర్వహించారు.

పెనుమూరులో..

పెనుమూరు(కార్వేటినగరం): మండలంలోని ముస్లింలు శనివారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు నూరానీ మసీదు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. అనంతరం పురవీధుల్లో ముస్లింలు ర్యాలీగా ఈద్గా వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేపట్టి, నమాజ్ చదివారు. అనంతరం ఇళ్లకు చేరుకుని ప్రజలకు ఖుర్బానీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్.మహబూబ్ బాషా, షంషీర్, అల్తాఫ్, మున్నాఖాన్, ఎస్.సిరాజ్ బాషా, ఎస్.ఆరీఫ్, ఎస్.ఆజాద్, ఇమ్రాన్, ఎస్.గఫూర్ పాల్గొన్నారు.

నగరిలో..

నగరి: పట్టణంలో శనివారం త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి పట్టణంలోని ముస్లింలు నూతన వస్త్రాలతో కోలాహలంగా కనిపించారు. బక్రీద్ పండుగను అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక జామియా, మక్కా మసీదుల్లో అధిక సంఖ్యలో ముస్లింలు హాజరై ప్రత్యేక నమాజ్ చేశారు. మధ్యాహ్నం తమ నివాసాల సమీపంలో ఉన్నవారికి విందు అందించారు. మండలంలోని మీరాసాహెబ్ పాళెం, వేలావడి తదితర ముస్లింల గ్రామాల్లో బక్రీద్ సందడి కనిపించింది.

బక్రీద్ వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా

మున్సిపల్ పరిధి ఇందిరానగర్‌లో వైఎస్ఆర్ సీపీ నాయకుడు బిలాల్ నివాసంలో శనివారం రాత్రి నిర్వహించిన బక్రీద్ వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, పట్టణ పార్టీ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలంలో ముస్లింలు బక్రీద్ పర్వదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవలకొండ, బాలగంగానపల్లి, అబ్బాస్ నగర్ కాలనీ, ఆవలాపూర్ గ్రామాల్లో పలువురు ముస్లిం చిన్నారులు, యువకులు, పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈద్గా వద్ద బక్రీద్‌పై మత గురువు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండలంలోని ముస్లింలు శనివారం బక్రీద్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు మసీదు ఆవరణలో పేదలకు దానధర్మాలు చేపట్టారు. మసీదులు, దర్గాలతో పాటు, ముస్లిం కాలనీలను, వీధులను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

పుత్తూరులో..

పుత్తూరు: పట్టణంలో శనివారం బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక తిరుపతి రోడ్డు, గేట్‌పుత్తూరు, షాపువీధిలోని ఈద్గా మసీదుల్లో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని పొట్టేళ్లు, మేకపోతు మాంసాన్ని ఖుర్బాని పేరిట పేదలకు పంచిపెట్టారు. తిరుపతి రోడ్డులోని మసీదు వద్ద ముస్లిం మత పెద్దలు మాట్లాడుతూ బక్రీద్ ప్రాముఖ్యతను తెలియజేశారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని, ముస్లింలు విధిగా నమాజు చేయాలని సూచించారు. సేవాగుణంతో పదిమందికి చేయూతనివ్వాలని చెప్పారు.




బక్రీద్ వేడుకల్లో మాజీ మంత్రి ఆర్కే రోజా



మీరాసాహెబ్ పాళెంలో బక్రీద్ ప్రార్థనలు

వైభవంగా ధ్వజారోహణం

- ప్రారంభమైన అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలు
- పెద్దశేష వాహనంపై ప్రసన్న వేంకటేశుడు



అప్పలాయగుంటలో ఊంజల్ సేవ



ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు



పెద్దశేష వాహనంపై శ్రీవారు



తిరుచ్చిపై శ్రీవారు

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7.30 నుండి 8 గంటల మధ్య మిథున లగ్నంలో వైఖానసాగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. అంతకుముందు ఉదయం 5.30 నుండి 6 గంటల వరకు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ధ్వజస్తంభం వద్ద విశేషపూజా కార్యక్రమాలు జరిగాయి. అంతకుముందు భేరితాడనం, భేరిపూజ, ధ్వజపటం, నవసంధి, శ్రీవారి మాడ వీధి ఉత్సవం, ఆస్థానం నిర్వహించారు. మిథున లగ్నంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి సమక్షంలో ధ్వజారోహణం నిర్వహించారు. ఇందులో వైఖానస శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడమే ధ్వజారోహణ ఘట్టం ఆంతర్యమని అర్చకులు వివరించారు. అంతకు ముందు తెల్లవారుజామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొల్పి శుద్ధి, కొలువు, తోమాలసేవ, అర్చన, మొదటి గంట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ధ్వజారోహణం అనంతరం ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు అర్చకులు స్వామివారి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి ఉదయం 9.30 నుండి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేపట్టారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 6.30 వరకు ఊంజల్ సేవ నిర్వహించారు.

పెద్దశేష వాహనంపై స్వామివారు

బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు రాత్రి 7 గంటలకు పెద్దశేష వాహనంపై శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి సమేతుడై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. మాడవీధుల్లో స్వామివారికి పెద్దసంఖ్యలో భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంతసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ డెప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఏవీఎస్ఓ సతీష్ కుమార్, ఇతర అధికారులు, ఆలయ అర్చకులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీటీడీ పటిష్ట ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ పటిష్ట ఏర్పాట్లు చేపట్టింది. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిది రోజులపాటు భక్తులకు అన్నదానం, ఆకర్షణీయంగా విద్యుత్ అలంకరణలు, పుష్పాలంకరణలు, క్షేత్ర మహిమను తెలిపేలా ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేశారు. ఎస్వీ మ్యూజిక్ కళాశాల, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్వామివారి ఆలయ ప్రాంగణంలో ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి, స్వామివారిని దర్శించుకొన్నారు.

ఆకట్టుకొన్న పుష్పాలంకరణ

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆకట్టుకునేలా పుష్పాలంకరణలు, విద్యుత్ దీపాలంకరణలు రూపొందించారు. భక్తులకు వేసవిలో ఇబ్బంది లేకుండా చలువ పందిళ్లు, తాగునీరు, మజ్జిగ, అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రథమ చికిత్స కేంద్రం, ఆయుర్వేద వైద్యశాల తదితర కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కేశవరాజుకు మాజీ డిప్యూటీ సీఎం పరామర్శ



కేశవరాజును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం: మండలంలోని గంగమాంబపురం మాజీ సర్పంచ్ కేశవరాజు ఆరోగ్యాన్ని శనివారం తమ పార్టీ కార్యకర్తలతో కలసి పరామర్శించారు. కేశవరాజు ఆరోగ్యం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. రాచపాల్యం అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్ఆర్ సీపీ చంద్రశేఖర్ మృతి చెందిన కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఆయన వెంట రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు చందురాజు, కార్వేటినగరం శేఖర్‌రాజు, జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్, గోపాల్, షణ్ముగరెడ్డి, సుందరరాజు, నరసింహనాయుడు, క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.